# ట్రంకుపెట్టె

రచన :
చీమలపాటి సూర్యనారాయణ

మెయిల్ విజయనగరం వచ్చే వేళయింది; ప్లాటుఫారం జనసమ్మర్దముతోను, కోలాహలముతోను నిహితమై వుంది. అప్పుడే పలహారము ముగించుకుని, బ్రేవుమని తేల్చుకుంటూ, 'శ్రీకాకుళము' పోయేందుకు టిక్కట్టు కొనుక్కుని ప్లాటుఫారముమీదకు వచ్చి, పచార్లు చేయ నారంభించాను.

కర్మసాక్షి పశ్చిమ పర్వతముల వెనుకెంతో అందంగా యస్తమిస్తున్నాడు. పర్వతముల వెనుకభాగమున ప్రక్కల నుండి దిగంతములవరకు విరజిమ్మబడుతూన్న సూర్యుని యస్తమయ కిరణజాలము : హృదయాని కెంతో యాహ్లాదమును కలిగిస్తున్నాది; గగనము నలుమూలలా స్నిగ్ధమయిన ఎరుపు అలుముకున్నది.

ఆ రెండవ తరగతి కంపార్టుమెంటులో అట్టేమంది జనము లేరు ఒక్క మనిషిఁ గంటె! అతని కెదురుగాఁ గూర్చున్నాను. ఆ నూతన వ్యక్తి పేపరు జదపటం విరమించి, తీరుబడిగా సిగరెట్టు కాలుస్తున్నాడు.

"మీరెందాక ప్రయాణము జేస్తారు మాష్టారూ?" అని ప్రశ్నించాడు.

"శ్రీకాకుళమువరకు!" అని ముక్తసరిగ జెప్పాను.

అతను బ్రహ్మపురమువరకు ప్రయాణము జేస్తాడని తరువాత దెల్సుకున్నాను! అతనిచ్చిన సిగరెట్టును ముట్టించి లోకాభిరామాయణం మాట్లాడుకోసాగేం. యింకా మెయిల్ కదలటములేదు. యింతలో ఓ యిరువై సంవత్సరముల యువతి మా కంపార్టుమెంటులో ప్రవేశించి తనతో దెచ్చిన "ట్రంకుపెట్టె"ను మీదనుపెట్టి నాకు సమీపములో గూర్చుంది. అప్రయత్నముగా మాకళ్ళు ఆమెవైపు దిరిగాయ్! ఆపిల్ల శరీర సౌందర్యము యౌవనపు బిగువు: ఎదుటుండే ప్రతీ మగప్రాణి శరీరములోని రక్తమును 5 th Colminist గా పనిజేయించక మానదు!

ఆమెతో మాట్లాడదామన్న అభిలాష ఉత్సాహం వుబలాటం మా వుభయులకూ మనస్సుల్లో ' కోరిక ' రూపంలో వున్నాయ్! కానీ ధైర్యం ఎవరికి మోకాలులోంచి, మనస్సులోకి రాకుండాయుంది. చివరకు నేను ధైర్యందెచ్చుకుని.

"మీరెందాక ప్రయాణముఁ జేస్తారండి?—" అని ప్రశ్నించా మర్యాదకు భంగం రాకుండ.

"నౌపడ" అంది... నేనే ముక్తసరిగ మాట్లాడుతానను కుంటే, నాఁకంటే ముక్తసరిగ మాట్లాడింది.

"తమర్ని యెక్కడో చూచినట్లు జ్ఞప్తి. (యిలాగనకపోతే దానిపేరు తెల్సుకోవటం కష్టం!) తమరి పేరు నేను..." అని వూరుకున్నాను.

"ఎస్. వరలక్ష్మి!" అంది నవ్వుతు. మెయిల్ తన ప్రయాణమును సాగిస్తునే యుంది... ఆమెకు, నాకు మధ్యనెంతో పరిచయం—చనువు స్వల్పకాలములోనే **యేర్పడి**నందుకు మీరాశ్చర్యపడతారు... ప్రక్క కంపార్టుమెంటులో నుంచి బిక్షకుఁడెంతో హాయిగా గానంజేస్తున్నాడు.

"లేదని వాపోవనేల? పోయె నంచు ఖేదమేల?
ఖేద మోదములమధ్య జీర్లాడు జీవికి,
శాంతి యెదిరా వాడికి సదా శాంతి!
శాంతియే జీవికి సదా సౌఖ్యము లిచ్చు;
శాంతియే జీవికి సర్వాభరణములపెట్టు;
శాంతియే మనుజుల "మహాత్ములు"గమార్చు!
ఖేదాది విచారాలు కల్పించుఁ గష్టాలు;
నిత్యసంతోషివై నడపరా నీ జీవిక!
మరు నిమేషమ్ము మనది కాదోరన్నా!
తానేగు కాలంబు తాళదో రన్నా!!
లేదని వాపోవ నేల?
పోయె నంచు ఖేదమేల??"

అనూన వర్షంకురుపించే అసావేరి రాగంలో గానం జేస్తుంటే చెవుల కెంత యింపుగా వుంది? ఆపిల్లకెలాగుందో? కిటికీలో నుంచి పరుగెత్తే చెట్లు, చేమలవైపు ఇంపుగాఁ జూస్తున్నాది.

ఇంతలో — మెయిల్ — "దూసి"లో ఆగింది... ఇంకా పిల్ల కిటికీలోనుంచి బయటప్రపంచాన్ని జూస్తూంది. నేను టీ తాగేందుకు, ప్లాటుఫారంమీద రైల్వేరూల్సుకు వ్యతిరేకము వేయబడిన "బడ్డీ-టీ-స్టాలుకుఁబోయి, గరంగరం-చా-త్రాగుతున్నాను. ఇంతలో ఆమెఁ గూడా అక్కడకొచ్చి, ఫలహారం టీ తీసుకుంది; తీరా బిల్లు చెల్లించేవేళకు తన పర్సులో చిల్లర లేకపోయింది. అన్నీ వందరూపాయల నోట్లే!!

దిక్కులుఁ జూస్తూంది; ఆమెవాలకముఁ గనిపెట్టిన నేను ఆమె వొద్దంటూన్నా దానికేం లెండి; పర్వాలేదులెండి; ఒకరి కొకరం సహాయపడకఁబోతే యెట్లా? నోటు మార్చి,

ఇద్దరుగాని లెండి!—" అంటూ, ఆమె బిల్లును చెల్లించాను. ఇరువురం నోటు మార్చేందుకు స్టేషనులోనికి వెళ్లాము... స్టేషనుమాష్టరు ఆపిల్లదగ్గర నోటుఁ బుచ్చుకుని, యిప్పుడే వస్తానంటూ, యేదో పనిమీద గార్డుదగ్గరకు పోయాడు. నేను కొంతసేపు అక్కడ గూర్చున్న తర్వాత—

"చూడండి; మీ రన్యథా భావించకండి; నే నొకటి చెప్పదలుచుకున్నాను : మీరు ముందుగా పోయి, నా పెట్టెను భద్రంగాఁజూస్తే చాలును : నాకు ధైర్యం! ఇతను చిల్లరిచ్చేయగానే గమ్మున వచ్చేస్తాను; మీకు శ్రమ యిచ్చినందుకు మన్నించండి!" అంది ప్రాధేయపూర్వకంగా;

"అయ్యో, దీనికింత బ్రతిమాలుకోవటం యెందుకు? తప్పకుండ జూస్తాను!" అంటూ, ముందుకు పురోగమించాను.

(మెయిల్) కదిలింది.

ఆపిల్ల రాలేదు...నిలువునా నీరైపోయాను...ఆశ్చర్యపోయాను...మెయిలు కదిలేవేళవరకు ఆమెకు స్టేషనుమాష్టరు చిల్లర యివ్వలేదని, ఆ వంద రూపాయిలగురించా పిల్ల ఆగిపోయిందని, తన పెట్టెను శ్రీకాకుళం స్టేషనుమాష్టరు కప్పఁజెప్తాననుకుందని నేను భావించాను. ఎలాగైనా యీపెట్టెను కాజేద్దామన్న తలంపు నాకు కలిగింది.

ఇంతలో శ్రీకాకుళంరోడ్డు స్టేషను వచ్చింది నేను పెట్టెను బయటకుఁ దీస్తున్నాను.

"ఎందుకండీ, పెట్టెను దీస్తున్నారు ? —" అని ప్రశ్నించాడు.

"ఏమీ లేదు" అని బయటకు లాగేను. అతను నా చెయ్యి పట్టుకుని.

"మొదట మర్యాదగా, ఆపెట్టెనక్కడ బెట్టవయ్యా!" అని గర్జించాడు.

"ఫూల్, చెయ్యొదులు; ఆపిల్ల బద్రంగాఁ జూడమని, స్టేషనులో బ్రతిమాలుకుంది తెలుసా? జబరదస్తీ చేశావంటే దవడపళ్ళు రాలేను!" అని అతణ్ణి వెనక్కు నెట్టాను.

"అమర్యాదగా మాట్లాడేవంటే వీపు విమానం మ్రోత మోగుతుంది; జాగ్రత్త—హెచ్చరిక, సాహెూ! ఆపిల్ల టీ త్రాగడానికి పోయేటప్పుడు నాకప్పజెప్పింది తెలుసా? వీడి కప్పఁజెప్పిందట! అన్నీ సొల్లుకబుర్లే. పెట్టెను కాటేద్దామనుకుంటున్నావు కాబోలు ; అటువంటి పప్పులు మనదగ్గ రుడకవ్" అన్నాడు. వాడుద్దేశ్యమును గ్రహించాను. వాడికీ పెట్టెను దక్కనీయకుండా చేద్దామన్న యుద్దేశముతో పెట్టె బట్టుకుని దిగిపోతున్నాను. అతను నన్ను దిగనీయకుండా,

"ఏమిరోయ్, నేఁ జూస్తూండగానే, నాపెట్టెను దొంగలిస్తున్నావా? గుండెలుఁదీసినపని; మొదలు పెట్టెనొదులు?" అని గర్జించాడు. అతను వేసిన యెత్తుకు నే యెంతయినా డంగైపోయాను. దీని నెట్లాగయినా వొదలుకూడదన్న దృఢాభిప్రాయముతో "ఎన్ని గుండెలుండాలిరా : నాపెట్టెను నీ దనేందుకు! జాగ్రత్త!" అంటూ, యిద్దరం ప్లాటుఫారంమీద దెబ్బలాడుకుంటున్నాము.

ఇద్దరు రైల్వేపోలీసు లక్కడకొచ్చి "ఎందుకోయ్, మీరిద్దరూ పొట్టేళ్ళుమల్లే దెబ్బలాడుకుంటున్నారు?" అని ప్రశ్నించాడొకఁడు. మే మిరువురం వొక్కమారే చెప్పేందుకు ప్రయత్నించాం కానీ నాగొంతుకంటే వాడిదే పెద్దగా వినబడుతూంది.

"చూడవయ్యా, పోలీసు : ఆ మాదచ్చోదు నిద్దరఁబోతూంటే నాపెట్టెపట్టుకు జారుకుంటున్నాడు. న్యాయం విచారించండి!" అన్నాడు.

నాకు పౌరుషం వచ్చింది. "మళ్లీ అను అమాట : బుర్ర రామకీర్తనపాడగలదు; నాపెట్టె కాజేద్దామన్న వుద్దేశముతో యీ నాటకం పన్నేడు బాబు; నమ్మకండి లంజకొడుకు మాటల్ని : నమ్మకండి;అన్నీ యభూత కల్పనలే!" అన్నాను.

"మీ ఉభయులలో ఎవరిమాట నమ్మడానికి వీలు లేకుండా వుంది. స్టేషనుమాష్టరుదగ్గరకు రండి!" అంటూ, మా యిద్దర్ని పెట్టెతోసహా తీసుకుపోయారు.

"మీ తగువులను విన్నాను; యీ ట్రంకుపెట్టె మీదే ఐతే—ఇందులో ఏ సామానుందో చెప్పండి?" అన్నాడు... నా గుండెలు గుభేలు మన్నాయ్. నన్నడిగితే యేమని చెబుదును? యీపెట్టెను దెచ్చింది ఆడమనిషి! వాళ్ళకు సంబంధించిన సామాను లుండేందు కవకాశముంది; నన్నడుగుతే ఆడవాళ్ళకు సంబంధించిన వస్తువులు చెప్పేందుకు నిశ్చయించాను.

అవ్యక్తిమాత్రం నసుగు, తర్జనబర్జన లేకుండా వాడి నోటికి వచ్చినట్లు కూశాడు.

మా యిద్దరి వాఙ్మూలములు విన్నతరువాత, స్టేషనుమాష్టరు ఆ పెట్టెను విడఁగొట్టారు.

అత్రంగా వొక్కమారు ఎవరిజోస్యం ఫలిస్తుందోగదా, అని వొంగి చూశాం. వొళ్లు కొయ్యబారింది. నోటంట మాట రావటం మానేశింది.

అందులో—

అప్పుడే పుట్టిన మగశిశువు మృతకళేబరం వుంది. ఇద్దర్ని అరెస్టుఁజేశారు!